# రేపటివాళ్లు-కుర్రవాళ్లు

రచన : స్వామి

పురాణ రచయితగారు ముక్కుపొడుం పీలుస్తూ అన్నారు. "ఈమధ్య ప్రబంధ కవులని, బయలుదేరారులెండి! వీళ్ళకు స్త్రీ సౌందర్యాన్ని నఖశిఖ పర్యంతం వర్ణించటం, పచ్చిశృంగారం ప్రధానమైపోయింది. కవిత్వాన్ని దైవికంగా వినియోగించటానికి బదులు దేహానికి సంబంధించిన క్షణభంగుర ఆనందాలకోసం ప్రకృతిని చిత్రిస్తూ...ప్చ్! పోయింది! మాతోటేపోయింది ఆ గొప్పతనమంతా!"

కొన్నాళ్లుపోయాక ప్రబంధ రచయితగారు తమలపాకుల్లో సుగంధ ద్రవ్యాలు మిళావుచేసి పోకచెక్క పట్ చెట్ మనిపిస్తూ మూల్గారు. "ఆ రసికత్వమూ, ఆ శృంగారమూ- అన్నీ పోనేపొయ్యేయ్ మాతోటే-ప్రేమపేరు చెప్పి ఏవోఖండ కావ్యాలు రాస్తున్నారు అల్పాయుష్కులు. పట్టుమని పదిగారెలు తినలేని వీళ్లు...ఏమిటో వీళ్ళమోహం వీళ్ళకు కవిత్వమేమిటి?...పుట్టతేనెలాంటి శృంగారాన్ని కాస్తా నీళ్లల్లాచేసి పారేస్తున్నారు. ఈ ప్రేమ కవులు. భావకవిత్వం!...వీళ్ల మొహం భావం! ఏడుపుగొట్టులు!!"

కాలం గడియారంపళ్ళల్లో చిక్కుకొనగానే ప్రేయసీ కవిగారు మేల్కొని, అద్దంలో తనగిరజాలు చూసుకొంటూ, ఫ్రేంలేని కళ్ళజోడులో కనిపించినంతవరకూ చూసి అన్నారు. "అయ్యయ్యో! ఉన్నతమైన హృదయ ప్రేమ, ఉత్తమమైన ఊహాప్రేయసీ విరహ భావకవిత్వాన్నిమాని, ఊహాగానంతో, గాలి భావాలతో ప్రకృతిని ఆరాధిస్తామంటూ, నదీనదాల్నీ, మేఘాల్నీ చిత్రంగా చెప్పుకుంటున్నారట-కవిత్వాన్ని హృదయంనిండా అలంకరించిన ప్రేయసికి అర్పించక పోవడంనీచం!"

తర్వాత ఆయన-రెక్కలువిప్పి ఎండినజుట్టు, మూసినకళ్ళు, చేతిపుస్తకంలో చూపుడు వేలు;- అన్నారు."నేటి కవిత్వం భావరహితంగా ఏదో బజారు కవిత్వం అయిపోతోంది. కవి తన కానందాన్నిచ్చే ప్రకృతికోసం, తన మనోవేగంలో అనేక భావకెరటాలను చిత్రించడానికి వినియోగించాల్సిన కవిత్వం మరేదో దానికి ఉపయోగిస్తాం;...అందరకూ అర్థమయ్యేలా తేలిగ్గా చెపుతాం అంటున్నారు. కవిత్వాన్ని ఆస్వాదించే హక్కు ప్రతీవాడికీ ఎక్కడిది? కవిత్వం కవితోపాసకుల సొత్తు, ప్రతీచచ్చూ అర్థంచేసుకొని ఆనందించగలడా ఈ నవ్యకవుల పిచ్చి కాని!"

ఆయన వెకిలి నవ్వు ఇంకా వినిపిస్తోనేఉంది. ఇంతట్లోకే సూటులో, కళ్లజోడులో ఒక దిన పత్రికతో బజారు కవిగారన్నారు; "నవ్యులు నేటి కవిత్వానికి ప్రయోజనం ఉండాలంటున్నారు, అబ్బెబ్బె, భావం మాత్రం పల్చగా, తేలిగ్గా, పదిమందికీ ఎరుకపరచమన్నాం కాని, అసలేభావం లేకుండా ఏవో సమస్యలకోసం... ఏదో ప్రయోజకత్వంకోసం...ఈ సమాజం... ఈమనుషులు ...ఈదేశం...ఈబానిసలు..... అబ్బెబ్బె! కవిత్వం బొత్తిగా ప్రచారంకోసమే అయితే కవిత్వం ఆత్మహత్య చేసుకోవలసిందే."

పొట్టి నిక్కరు...యూనిఫారం తెల్ల చొక్కా, చేతిలో ఒకవారపత్రిక, సిగరట్టు ... ఆయన అన్నారు: "అభ్యుదయమంటే నేటి పరిస్థితుల్నిగురించి సామాజికంగా...అంటే సమాజానికి ఉపకరించినంతవరకూ ప్రజాబౌన్నత్యానికై రాయటం-అంతేకాని 'విప్లవం!... తిరుగుబాటు !!...తిరుగుబాటు!! పీడిత వర్గమా లెమ్ము! -పాలిత జాతుల్లారా లేవండి!-లెండి పోదాంముందుకు! శ్మశానాలే స్వర్గానికి నాంది పాడతై—రక్తపాతమే శాంతికి అరుణోదయం! సమరరుధిరం శాంతియుగానికి సారధి! 'విప్లవం! ...విప్లవం!!' ఏమిటయ్యా ఈ అరుపులు!"

ప్రచారం కవిగారిలాగే విప్లవ కవిగారు కూడా కంఠాన్ని బలంగా పెకిలిస్తున్నారు ఏదో మూల్గుదామని; వినివిని విసిగి దూరంగా పోతూవున్న నాచెవులో సణుగులు అస్పష్టంగా వినపడ్డాయి.